epaper.tcnewsdaily.com
www.tcnewsdaily.com

# తెలంగాణ చౌరస్తా


Voice Of Democracy

సంపుటి: 01 సంచిక:243

24 క్యారెట్లు 158,080.00 | కిలో వెండి 2,80,000.00 | tcnewsdaily | 18.03.2026 బుధవారం, హైదరాబాద్

# అసెంబ్లీలో హైవోల్టేజ్ పాలిటిక్స్

## మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలిచ్చాం




తెలంగాణ శాసనసభలో మహిళా సంక్షేమంబ్వ్య బిపై జరుగుతున్న చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. రాష్ట్రంలోని మహిళా సంఘాలకు గత రెండు సంవత్సరాల్లో ఏకంగా 57,000 కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు అందించామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించడంతో వివాదం మొదలైంది. ఈ గణాంకాలను తీవ్రంగా ఆక్షేపించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఒకవేళ మీరు చెప్పినట్లు 57,000 కోట్ల రుణాలు ఇచ్చినట్లు ఆర్డర్ కాపీ చూపిస్తే, నేను ఇప్పుడే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వెళ్లిపోతాను అంటూ అసెంబ్లీ సాక్షిగా సవాల్ విసిరారు.

- ప్రభుత్వం చెబుతున్న లెక్కలు తప్పు
- తప్పని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటాన్న
- మంత్రి సీతక్కకు కేటీఆర్ సవాల్
- తప్పకుండా నిరూపిస్తా
- మాటకు కట్టుబడి కేటీఆర్ రాజీనామా చేయాలి
- మంత్రి సీతక్క

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**
వెంటనే గణాంకాలతో కూడిన వివరాలను సభ ముందు ఉంచారు. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా విడుదల చేసిన రుణాల మొత్తం, అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను ప్రస్తావిస్తూ ఆమె కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. కేవలం రుణాలు ఇవ్వడమే కాదు, వాటిపై పడే వడ్డీ భారాన్ని కూడా భరిస్తూ ఇప్పటివరకు 1,390$ కోట్ల రూపాయల వడ్డీని ప్రభుత్వం చెల్లించింది. అన్ని ఆధారాలు బయటపెట్టాం, ఇప్పుడు కేటీఆర్ తన మాటకు కట్టుబడి రాజీనామా చేయాలి అని సీతక్క డిమాండ్

।మిగతా 2 లో।




## జగ్గారెడ్డి మరో పీజేఆర్

- ఆయనను పీసీసీ అధ్యక్షుడిని చేయాలి
- జగ్గారెడ్డి వచ్చే ఎన్నికల్లో వంద సీట్లు సాధిస్తాడు
- ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే ఆదుకుంటాడు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

2లో




## మమత సువేందు మళ్లీ ఢీ

- 291 మంది అభ్యర్థులతో టీఎంసీ జాబితా
- భవానీపూర్ బరిలో మమత
- సువేందుతో మళ్లీ ఢీ
- బీజేపీ పాలనా వైఫల్యం వల్లే వంటగ్యాస్ సంక్షోభం
- ఎన్నికల్లో పోటీచేయాలని అనుకుంటే, వంటగ్యాస్ సంక్షోభాన్ని సృష్టించొద్దు
- జనంలోకి వెళ్లేందుకు బీజేపీ భయపడుతోంది
- అభ్యర్థుల జాబితా విడుదల వేళ సీఎం మమత బెనర్జీ

2లో

*బంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం 291 మంది అభ్యర్థుల పేర్లతో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ జాబితాను విడుదల చేసింది. మంగళవారం మీడియా సమావేశం వేదికగా ఈ జాబితాను టీఎంసీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ విడుదల చేశారు. మిగతా మూడు సీట్లను తమ మిత్రపక్షం భారతీయ గోర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చా (బీజీపీఎం)కు ఇచ్చామని ఆమె తెలిపారు. డార్జిలింగ్, కుర్సేఓంగ్, కాలిమ్ పోంగ్ స్థానాల్లో బీజీపీఎం పోటీ చేస్తుందని వెల్లడించారు. టీఎంసీ జాబితా ప్రకారం, భవానీపూర్ అసెంబ్లీ స్థానం నుంచి మమతా బెనర్జీ పోటీ చేస్తున్నారు. అక్కడి నుంచి బీజేపీ అభ్యర్థిగా, రాష్ట్ర విపక్ష నేత సువేందు అధికారి బరిలోకి దిగారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ స్థానంలో దీదీని సువేందు ఓడించారు.*

-తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో






## రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్

- ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సస్పెండ్
- ఒడిశా, హరియాణాలో కాంగ్రెస్ క్రాస్ ఓటింగ్
- హరియాణాలో బీజేపీ ఓట్ చోరీకి పాల్పడింది
- ఒడిశా కాంగ్రెస్ ఆరోపణలు
- హరియాణాలో బీజేపీ ఓట్ చోరీకి పాల్పడింది
- ప్రజాస్వామ్యంపై బీజేపీకి విశ్వాసం లేదు
- ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా విభాగం ఛైర్మన్ అరబింద దాస్

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**
రాజ్యసభ ఎన్నికల క్రాస్ ఓటింగ్ కు పాల్పడిన ముగ్గురు ఎమ్మెల్యేలను కాంగ్రెస్ సస్పెండ్ చేసింది. సోఫియా ఫిర్దౌస్, రమేష్ జెనా, దాశరథి గోమాంగో అనే ముగ్గురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తున్నట్లు ఒడిశా కాంగ్రెస్ ప్రకటించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాల కారణంగా ముగ్గురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసినట్లు వెల్లడించింది. "సోమవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ శాసనసభ పక్షానికి చెందిన ముగ్గురు సభ్యులు పార్టీ ఆదేశాలను ధిక్కరించి బీజేపీ మద్దతు ఇచ్చిన అభ్యర్థికి ఓటు వేశారు. వారిని తక్షణమే

।మిగతా 2 లో।

## నాకు నయనతార కావాలి

- స్టాలిన్ నా కోరిక తీరుస్తారా..?
- అన్నా డీఎంకే ఎంపీ సీ వేణుగోపాల్ షణ్ముగం
- స్టాలిన్ 'మీ కలను మాతో చెప్పండి' కార్యక్రమంపై సెటైర్స్
- యావత్ మహిళా లోకాన్ని షణ్ముగం అవమానించారు
- డీఎంకే అధికార ప్రతినిధి డాక్టర్ సయ్యద్ హాఫీజుల్లా
- క్షమాపణ చెప్పండి
- ఎంపీ షణ్ముగంకు ఫిల్మ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ లేఖ
- మీ సైద్ధాంతిక భావజాలం ఇదే బోధిస్తోందా..?

2లో



2లో

## డ్రగ్స్ టెస్టుకు సీఎం రెడీ

- మరి కేసీఆర్, కేటీఆర్ వస్తారా ?
- మండలిలో మహేష్ గౌడ్ ఛాలెంజ్
- ఫాంహౌస్ డ్రగ్స్ కేసు అసెంబ్లీలో తీవ్ర రచ్చ
- అధికార,ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం
- ప్రజలకు ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలవాలి
- పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయి పరం
- డ్రగ్స్ రహిత రాష్ట్రంగానికి ప్రభుత్వం చర్యలు
- నేరస్తులు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదు
- చట్టం తన పని తాను చేసుకుపోతుంది

## రోహిత్ రెడ్డిపై బీఆర్ఎస్ అధిష్ఠానం చర్యలు

- పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండండి
- రోహిత్‌రెడ్డి వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన బీఆర్ఎస్ అధిష్ఠానం
- షోకాజ్ నోటీసు జారీ చేసిన భారత రాష్ట్ర సమితి
- వారం రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశాలు
- నైతిక విలువలకు కట్టుబడి ఉన్నాం
- భారత రాష్ట్ర సమితి
- ఫామ్ హౌస్ వేదికగా జరిగిన అంశాలపై విచారణ
- ప్రత్యేక విచారణ బృందం సిట్ ఏర్పాటు
- డ్రగ్స్ దందాతో దుబాయ్‌కు ఉన్న సంబంధాలపై ఆరా

2లో



## సీఎం సంతకం చేసిన తొలిదస్త్రం ఏమైంది..?

- సీఎం ఫైల్‌కే దిక్కు లేకపోతే...
- కాంగ్రెస్ మాయ మాటలు ఎవరు నమ్మరు
- మాయమైన దస్త్రం కోసం సిట్ ఏర్పాటు చేయాలి
- అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కాంగ్రెస్ వచ్చాక ఉద్యోగాలు తగ్గాయి
- రుణమాఫీ జరగకపోతే మీరు రాజీనామా చేస్తారా
- అందరూ ఢిల్లీకి వెళ్లి నిధులు తీస్తుంటే...
- రేవంత్ రెడ్డి ఇక్కడి నిధులు ఢిల్లీ పంపుతుండు
- మహిళలకి ఇస్తానన్న తులం బంగారం ఏది
- కాలేజీకి వెళ్లే యువతులకు స్కూటీలు ఇవ్వాలి



**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**
నేనే రాజు నేనే మంత్రి' అని మిడిసిపడ్డ వారు సంపద మూటగట్టుకుపోలేరని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో కేటీఆర్ మాట్లాడారు. ఎన్నికల హామీ దస్త్రంపై ముఖ్యమంత్రి సంతకం చేశారని 2023 సంవత్సరం నాటి గవర్నర్ ప్రసంగంలో ఉందని, సంవత్సరాలు గడిచినా సీఎం సంకల్పం, చిత్తశుద్ధి ఏమైంది? ప్రశ్నించారు. తొలి క్యాబినెట్‌లోనే 6 హామీలకు చట్టబద్ధత కల్పిస్తామని

।మిగతా 2 లో।

# అసెంబ్లీలో హైవోల్టేజ్ పాలిటిక్స్



మొదటి పేజీ తరువాయి

చేశారు. సభకు వచ్చే ముందు కనీస హోం వర్క్ చేయకుండా, కేవలం రాజకీయ ప్రగల్భాల కోసం సవాళ్లు విసిరి కేటీఆర్ ఇప్పుడు సెల్ఫ్ గోల్ చేసుకున్నారని ఆమె ఎద్దేవా చేశారు.

ఇదే క్రమంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరిని కూడా సీతక్క ఎండగట్టారు. గత పదేళ్ల కాలంలో మహిళా సంఘాలకు అందాల్సిన 4,000 కోట్ల రూపాయల వడ్డీని కేసీఆర్ ప్రభుత్వం ఎగ్గొట్టిందని, పేద మహిళల భద్రత కోసం ఉద్దేశించిన అభయహస్తం నిధులను కూడా దారి మళ్లించారని ఆమె విమర్శించారు. ప్రభుత్వంపై బురద చల్లడమే ధ్యేయంగా పెట్టుకున్న కేటీఆర్, ఇప్పుడు ఆధారాలతో సహా దొరికిపోయారని.. రాజీనామా చేసి తన విలువను కాపాడుకోవాలని ఆమె సూచించారు. సభలో జరిగిన ఈ ఉత్కంఠభరిత పరిణామాలతో అసెంబ్లీ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

# మమత -సువేందు మళ్లీ ఢీ



తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం 291 మంది అభ్యర్థుల పేర్లతో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ జాబితాను విడుదల చేసింది. మంగళవారం మీడియా సమావేశం వేదికగా ఈ జాబితాను టీఎంసీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ విడుదల చేశారు. మిగతా మూడు సీట్లను తమ మిత్రపక్షం భారతీయ గోర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చా (బీజీపీఎం)కు ఇచ్చామని ఆమె తెలిపారు. డార్జిలింగ్, కుర్సేంగ్, కాలిమ్ పోంగ్ స్థానాల్లో బీజీపీఎం పోటీ చేస్తుందని వెల్లడించారు. టీఎంసీ జాబితా ప్రకారం, భవానీపుర్ అసెంబ్లీ స్థానం నుంచి మమతా బెనర్జీ పోటీ చేస్తున్నారు. అక్కడి నుంచి బీజేపీ అభ్యర్థిగా, రాష్ట్ర విపక్ష నేత సువేందు అధికారి బరిలోకి దిగారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ స్థానంలో దీదీని సువేందు ఓడించారు. దీంతో ఈసారి నందిగ్రామ్‌తో పాటు భవానీపుర్ సీటును ఆయనకే బీజేపీ పెద్దలు కేటాయించారు.

బీజేపీ పాలనా వైఫల్యం వల్లే భారతదేశంలో ఎల్‌పీజీ వంటగ్యాస్ సంక్షోభం ఏర్పడిందని సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని అనుకుంటే, వంటగ్యాస్ సంక్షోభాన్ని సృష్టించొద్దని బీజేపీకి ఆమె సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో జనంలోకి వెళ్లేందుకు బీజేపీ భయపడుతోందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) బంగాల్‌లో చాలా తెలివిగా పావులు కదిపిందని, అయినా బీజేపీకి ఛాన్స్ లేకుండా పోయిందని మమత ఎద్దేవా చేశారు. గత ఎన్నికల కంటే ఈసారి బీజేపీ అసెంబ్లీ సీట్లు తగ్గిపోతాయన్నారు. ఇది బంగాల్ అస్తిత్వానికి సంబంధించిన ఎన్నిక అని, ఇందులో దిల్లీ లడ్డూ గెలవదని, బంగాలే గెలుస్తుందని దీదీ విశ్వాసం వెలిబుచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా తనకు ఉండే అధికారాలను, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హరిస్తోందని ఆమె తెలిపారు. నా సర్వ అధికారాలను కేంద్ర ప్రభుత్వం లాక్కుంది. ఒకవేళ రాష్ట్రంలో ప్రకృతి విపత్తులు వస్తే, ఎవరు బాధ్యత తీసుకోవాలి? ఒకవేళ శాంతిభద్రతల సమస్య తలెత్తితే, ఎవరు బాధ్యత తీసుకోవాలి? నా ప్రభుత్వంలోని అధికారులంతా బంగాలీలే, చివరకు వాళ్లను కూడా తొలగించారు. ఇక వినీత్ కుమార్, మురళీధర్ లాంటి బంగాలీయేతర అధికారులను సైతం లాక్కున్నారు. కేంద్ర భద్రతా బలగాలను రాష్ట్రంలో మోహరించారు. వాళ్ల బాధ్యతను ఎవరు తీసుకుంటారు? బయటి వాళ్లు బంగాల్‌లో ఉన్నారు. వాళ్ల దగ్గర డబ్బులున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒకవేళ ఏదైన జరిగితే, నిందలు నాపై మోపొద్దు" అని సీఎం మమత వ్యాఖ్యానించారు.

"బీజేపీ పథకం ప్రకారమే, ఆయుధాలతో వచ్చింది'" "ప్రధాని మోదీకి నేను చెప్పేది ఒక్కటే విషయం. 2026 ఎన్నికల్లో టీఎంసీ గెలవబోతోంది. గత ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలను టీఎంసీ సాధించబోతోంది. ప్రజలారా బీజేపీని బహిష్కరించండి. ఆ పార్టీకి ఓట్లు వేయొద్దు. ఈ ఎన్నికల్లో టీఎంసీకి 226కుపైగా అసెంబ్లీ సీట్లు వస్తాయి. నగదు ప్రోత్సాహకాల కంటే ప్రాంతీయ ఐక్యతకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలని నేను ఓటర్లను కోరుతున్నాను. ప్రజలు డబ్బుకు ఓటు వేయకూడదు. బంగాల్ అస్తిత్వానికి ఓటు వేయాలి. ఈ ఎన్నికల్లో బంగాల్ ప్రజలే గెలుస్తారు. బీజేపీ పక్కా పథకం ప్రకారమే, ఇక్కడికి ఆయుధాలతో వచ్చింది" అని సీఎం మమత ఆరోపించారు.



# జగ్గారెడ్డి మరో పీజేఆర్

తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:

కాంగ్రెస్ పార్టీ అంటేనే స్వేచ్ఛారాజకీయాలకు మారుపేరు అనే నానుడి ఉంది. దానికోసం ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదు. ఆ పార్టీ నాయకులే అప్పుడప్పుడు బయటపెడుతుంటారు. అదే దిశగా ఇప్పుడు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. ఎప్పుడూ జనంలో ఉండే జగ్గారెడ్డి మాస్ లీడర్ అని, ఆయనను తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం జగ్గారెడ్డి మరో పీజేఆర్ అంతటి వారని మెచ్చుకున్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే ఆదుకుంటాడని కితాబిచ్చారు. జగ్గారెడ్డి తెలంగాణ పీసీసీ చీఫ్ అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలవడం ఖాయమని అన్నారు. ఈ వ్యాఖ్యలు చేయడానికి కారణాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. టీపీసీసీ చీఫ్ గా ఒకసారి ఎన్నికైతే 3 సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం మహేశ్ కుమార్ గౌడ్ టీపీసీసీగా వ్యవహరిస్తున్నారు.

జగ్గారెడ్డి అసలు పేరు తూర్పు జయప్రకాశ్ రెడ్డి. ఈయన సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2018లో గెలుపొందారు. అంతకు ముందు బీజేపీ తరఫున మున్సిపల్ ఛైర్మన్ గా రాజకీయం జీవితం ప్రారంభించి, తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి 2004లో, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో(2009) కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2023లో జరిగిన ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి బరిలో దిగి బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ చేతిలో ఓటమిపాలయ్యారు. అయినా కూడా కాంగ్రెస్ పార్టీ జగ్గారెడ్డి భార్య నిర్మల జగ్గారెడ్డికి టీజీఐఐసీ కార్పొరేషన్ ఛైర్పర్సన్ పదవిని ఇచ్చింది. ప్రస్తుతం ఆమె చైర్ పర్సన్ గా కొనసాగుతున్నారు. ఆయన ఒకవేళ ఎమ్మెల్యేగా గెలిచి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో తప్పకుండా మంత్రి అయ్యేవారని విశ్లేషకులు గుర్తుచేస్తుంటారు. జగ్గారెడ్డి ఫిబ్రవరి నెలలో జరిగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజు హల్చల్ చేశారు. పోలీసులపై బూతుపురాణంతో విరుచుకుపడ్డారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.



# రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్

మొదటి పేజీ తరువాయి

పార్టీ నుంచి సస్పెండ్ చేశాం. పార్టీ వ్యతిరేక కార్యకలాపాల కారణంగా గజపతి జిల్లా కాంగ్రెస్ కమిటీ (DCC) అధ్యక్షుడు, ఎమ్మెల్యే దాశరథి గొమాంగో, సనఖేముండి ఎమ్మెల్యే రమేష్ జెనా, బారాబతికటక్ నియోజకవర్గ ఎమ్మెల్యే సోఫియా ఫిర్దౌస్ ఈ ముగ్గురినీ సస్పెండ్ చేశాం" అని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా విభాగం ఛైర్మన్ అరబింద దాస్ అన్నారు. అసెంబ్లీలో 14 మంది ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్, నాలుగో రాజ్యసభ స్థానానికి బీజేడీ అభ్యర్థి దత్తేశ్వర్ హోటాకు మద్దతు ప్రకటించింది. అయితే, బీజేడీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్ కారణంగా బీజేపీ మద్దతు తెలిపిన స్వతంత్ర అభ్యర్థి దిలీప్ రే గెలిచారు. రేకు అనుకూలంగా బీజేడీ, కాంగ్రెస్ పార్టీలు వేసిన క్రాస్ ఓటింగ్ వల్ల రాజ్యసభ ఎన్నికల్లో ప్రతిపక్షానికి కేవలం ఒక అభ్యర్థి విజయం మాత్రమే దక్కింది. అటు బీజేపీ సునాయాసంగా రెండు సీట్లను గెలుచుకోగా, ఒక సీటు స్వతంత్ర అభ్యర్థికి దక్కింది. వీరిలో బీజేపీ అభ్యర్థులు మన్మోహన్ సమల్, సుజీత్ కుమార్, బిజూ జనతా దళ్ అభ్యర్థి సంతృప్త మిశ్రా, స్వతంత్ర అభ్యర్థి దిలీప్ రే ఉన్నారు. హరియాణాలో బీజేపీ ఓట్ చోరీకి పాల్పడింది కాంగ్రెస్మరోవైపు హరియాణా రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ ఓట్ చోరీకి పాల్పడిందంటూ కాంగ్రెస్ ఆరోపించింది. క్రాస్ ఓటింగ్ కు పాల్పడిన ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. బీజేపీ, కాంగ్రెస్ కు చెందిన ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ కు పాల్పడ్డారంటూ ఆరోపణల నేపథ్యంలో ఆసక్తికరంగా మారిన ఎన్నికల్లో బీజేపీకి చెందిన సంజయ్ భాటియా, కాంగ్రెస్‌కు చెందిన కరమ్‌వీర్ సింగ్ బౌధ్ ఎన్నికయ్యారు. సునాయాస విజయం అవకాశం ఉన్న కాంగ్రెస్‌కు క్రాస్ ఓటింగ్ చేయడంతో స్వతంత్ర అభ్యర్థి సతీష్‌నందల్ (63)పై బౌధ్ స్వల్ప తేడాతో గెలుపొందారు. ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడానికి, ఓటు చోరీకి ప్రయత్నించిందని రోహతక్ కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హూడా ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై బీజేపీకి విశ్వాసం లేదని ఆ పార్టీ నిరూపించుకుందని ఆయన ఆరోపించారు. "బీజేపీ కేవలం అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తోంది. కానీ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు అప్రమత్తమై దోపిడీ జరగకుండా అడ్డుకుని సామాజిక న్యాయం కోసం పనిచేసే కరమ్‌వీర్ బౌధ్ విజయాన్ని అందించారు. బీజేపీ గుజరాత్ ఉప ముఖ్యమంత్రిని హరియాణాకు పరిశీలకుడిగా పంపి, ఎలాగైనా రాజ్యసభ సీటును గెలవాలని హైకమాండ్ ప్రయత్నించిందని అన్నారు.



# నాకు నయనతార కావాలి

తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:

అన్నా డీఎంకే రాజ్యసభ ఎంపీ సీ వేణుగోపాల్ షణ్ముగం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తనకు హీరోయిన్ నయనతార కావాలని, ఈ కోరికను తీరుస్తారా అని సీఎం స్టాలిన్‌ను ఆయన ప్రశ్నించారు. ఎవరికైనా నయనతారను పెళ్లి చేసుకోవాలని ఉంటే, ఆ కోరికను ముఖ్యమంత్రి నెరవేరుస్తారా అని అడిగారు. సీఎం స్టాలిన్ తాజాగా ప్రకటించిన 'మీ కలను మాతో చెప్పండి' కార్యక్రమాన్ని ఉద్దేశించి వేణుగోపాల్ షణ్ముగం ఈ కామెంట్స్ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు ఇంటింటికి తిరిగి, ప్రభుత్వం నుంచి ప్రజలు కోరుకునే అంశాలను, పాలనపై ఇచ్చే సలహాలు, సూచనలను తెలుసుకుంటారు. డీఎంకే ప్రభుత్వ పాలనా వైఫల్యం, మహిళలపై నేర ఘటనల పెరుగుదల, శాంతిభద్రతలకు భంగం వాటిల్లడం వంటి అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా అన్నాడీఎంకే నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈసందర్భంగా తన సొంత జిల్లా విల్లుపురంలో జరిగిన నిరసన కార్యక్రమం వేదికగా రాజ్యసభ ఎంపీ సీ వేణుగోపాల్ షణ్ముగం ఈ కామెంట్స్ చేశారు.

వేణుగోపాల్ షణ్ముగం వ్యాఖ్యలను డీఎంకే వర్గాలు తీవ్రంగా తప్పుపట్టాయి. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎవరైనా విమర్శించొచ్చని, కానీ మహిళలపై అశ్లీల వ్యాఖ్యలు చేయడం సరికాదని డీఎంకే అధికార ప్రతినిధి డాక్టర్ సయ్యద్ హాఫీజుల్లా హితవు పలికారు. నయనతార గురించి అలా మాట్లాడటం ద్వారా, యావత్ మహిళా లోకాన్ని ఎంపీ షణ్ముగం అవమానించారన్నారు. నాగరిక సమాజంలో ఇలాంటి వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కావని పేర్కొన్నారు. మహిళల గురించి ఇలా మాట్లాడినందుకు వేణుగోపాల్ షణ్ముగంపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నా డీఎంకే పార్టీకి ఆయన సూచించారు. షణ్ముగం వ్యాఖ్యలపై ఇప్పటివరకు అన్నా డీఎంకే పార్టీ అధికారికంగా స్పందించలేదు. ఇక షణ్ముగం వివాదాస్పద వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదు అన్నట్టుగా అన్నాడీఎంకే వర్గాలు వ్యవహరిస్తున్నాయి. నేతలు అలాంటి కామెంట్లు చేస్తే సమర్థించడం తమ డ్యూటీ కాదని ఆ పార్టీ అధికార ప్రతినిధి ఒకరు చెప్పడం గమనార్హం. మహిళలపై షణ్ముగం అశ్లీల వ్యాఖ్యలు చేయడం ఇదే తొలిసారేం కాదు. ఉచిత భార్యల పథకాన్ని కూడా సీఎం స్టాలిన్ ప్రకటించాలని గతేడాది ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల హామీల అమల్లో భాగంగా ఉచిత భార్యల పథకాన్ని ప్రకటించాలని సీఎం స్టాలిన్‌ను డిమాండ్ చేశారు. ఈ కామెంట్స్‌పైనా అందరిలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇంత దారుణమైన వ్యాఖ్యలు చేయడం సరికాదనే అభిప్రాయాన్ని అన్ని పార్టీల నేతలు వ్యక్తం చేశారు.

నయనతార పేరుతో అన్నా డీఎంకే ఎంపీ సీవీ షణ్ముగం చేసిన వ్యాఖ్యలపై సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై వెంటనే షణ్ముగంకు లేఖ రాసింది. బహిరంగ సభ వేదికగా పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధంగా షణ్ముగం వ్యాఖ్యానించారని అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. నటి నయనతార పేరును ప్రసంగంలో ప్రస్తావించడంపై మండిపడింది. మీ సైద్ధాంతిక భావజాలం ఇదే బోధిస్తోందా ? మీ నేతలు ఇలాగే మాట్లాడమని చెబుతున్నారా ? ఇలాంటి వ్యాఖ్యలను మీ నేతలు సమర్థిస్తారా ? అని ఎంపీ షణ్ముగంకు ప్రశ్నలు సంధించింది. బాధ్యతాయుత ప్రజాప్రతినిధిగా ఉండాల్సిన మీరు, ఇలా మాట్లాడినందుకు వెంటనే క్షమాపణ చెప్పాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. సినీ పరిశ్రమతో ముడిపడిన మహిళలపై ఇంకోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేయబోనని హామీ ఇవ్వాలని షణ్ముగంను కోరింది.

# సీఎం సంతకం చేసిన తోలిదస్త్రం ఏమైంది..?

మొదటి పేజీ తరువాయి

అన్నాని గుర్తు చేశారు. బహిరంగ వేదికపై ముఖ్యమంత్రి సంతకం చేసిన దస్త్రం ఏమైందని ముఖ్యమంత్రి ఫైల్‌కే దిక్కు లేకపోతే కాంగ్రెస్ పార్టీ మాటలు ఎవరు నమ్ముతారు? నిలదీశారు. మాయమైన దస్త్రం కోసం సిట్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు..? కాంగ్రెస్ నాయుకులు దిల్లీ వెళ్లి నిధులు తెస్తారనుకుంటే నిధులు ఇచ్చి వస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. 2023 సంవత్సరంలో ఐటీ ఉద్యోగుల సంఖ్య 9.46 లక్షలు అని, తాజాగా గవర్నర్ ప్రసంగంలో ఆ సంఖ్య 9.39లక్షలుగా పేర్కొన్నారని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చాక 7,000 ఉద్యోగాలు తగ్గాయనేది వాస్తవమా? కాదా? అని నిలదీశారు. ఉద్యోగాలు ఎందుకు తగ్గాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తక్కువగా వచ్చినా రాష్ట్రాన్ని దీటుగా నిలబెట్టామని, మనది కేంద్రంపై ఈఆధారపడే రాష్ట్రం కాదని తెలిపారు. రాష్ట్రంలో మిస్ వరల్డ్ పోటీలు ఘనంగా నిర్వహించారని, నిర్వాహకులు ఇబ్బంది పెట్టారని మిస్ ఇంగ్లండ్ ఆరోపించారని గుర్తు చేశారు.

మహిళలంటే గౌరవం ఉంటే మహిళామంత్రి ఇంటిపైకి పోలీసులను ఎందుకు పంపారని అడిగానని అది తప్పా అని ప్రశ్నించారు. తులం బంగారం ఇస్తామని చెప్పారని వెంటనే ఇవ్వాలని, కాలేజీకి వెళ్లే యువతులకు స్కూటీలు ఇస్తామన్నారని, ఇవ్వాలని, కేసీఆర్ కిట్ అని కాకుంటే రాహుల్ కిట్ అని ఇవ్వండని డిమాండ్ చేశారు. పోశమ్మ పొతం చేస్తే మైసమ్మ మాయం చేసినట్టుంది ఈ ప్రభుత్వం తీరని అన్నారు. ఈ ప్రభుత్వం ఇచ్చింది కేవలం 11 వేల ఉద్యోగాలు మాత్రమేనని, మిగిలినవన్నీ మా ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లలోని ఉద్యోగాలేనని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన లక్ష ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురు చూస్తున్నారని, దాదాపు 50 మంది వరకూ రిటైర్డ్ ఉద్యోగులు వైద్యం అందక చనిపోయారని ఆరోపించారు. వైద్యానికి డబ్బుల్లేక రిటైర్డ్ ఉద్యోగులు చనిపోతున్నారని విమర్శించారు.

చిరు ఉద్యోగుల అందరి జీతాలు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, కాంగ్రెస్ హయాంలో రైతుల గోస వర్ణనాతీతమని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో మూడు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారని, గవర్నర్ ప్రసంగంలో రూ.20 వేల కోట్ల రుణమాఫీ అని చెప్పారని, రూ.50 వేల కోట్లతో సంపూర్ణంగా రుణమాఫీ జరుగుతుందని చెప్పారని తెలిపారు. ఏ ఒక్క గ్రామంలోనైనా రుణమాఫీ జరిగిందని రుజువు చేస్తే అదే గ్రామంలో రాజీనామా చేస్తానని, రుణమాఫీ జరగకపోతే మీరు రాజీనామా చేస్తారా? అని కేటీఆర్ సవాల్ విసిరారు. ఎనుముల వారి పాలనలో ఎరువులకు దిక్కు లేదని, బఫర్‌జోన్లపై ఉన్న శ్రద్ధ బఫర్ స్టాక్‌పై లేదని అన్నారు. రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు వంద రోజుల్లో అమలు చేస్తామన్నారని, విద్యా భరోసా కార్డు ఇస్తే ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఇవ్వనక్కర్లేదని, ప్రభుత్వం భూములు లాక్కుంటుందని వర్సిటీలు ఆందోళన చెందుతున్నాయని తెలిపారు. వ్యవసాయ వర్సిటీలో వంద ఎకరాలు, హెచ్‌సీయూలో 400 ఎకరాలు తీసుకున్నారని, అబుల్ కలాం వర్సిటీలో 50 ఎకరాలు, ఐఎస్‌బీ భూములు తీసుకుంటున్నారని ఆరోపించారు. గురుకులాల్లో విషాహారంతో ప్రతిరోజూ మరణ మృదంగమని, గురుకులాల్లో 200 మంది మృతి చెందారని, విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని కోరారు. మీ మనసులోని ఆలోచనలను విద్యా విధానంలో తీసుకువచ్చారని అన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని, అద్దె బస్సులు తెచ్చి ఆర్టీసీని ముంచవద్దని కోరుతున్నామని అన్నారు. తాము డ్రైవర్ టు ఓనర్ పథకం తెస్తే మీరు ఓనర్లను డ్రైవర్లను చేశారని తెలిపారు. ఆరు లక్షల మంది ఆటో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో డ్రైవర్లకు 28 నెలలుగా బకాయి పడిన డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 28 నెలలుగా హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు మంజూరు చేశారా? ప్రశ్నించారు. ఒక్క ఇల్లు కట్టినట్లు రుజువు చేస్తే ఏ శిక్షకైనా తాము సిద్ధమని తెలిపారు. హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు కట్టకపోయినా వేలాది ఇళ్లు కూల్చారని, బుల్డోజర్ రాజ్యంలో హైడ్రా పేరిట అరాచకాలు చేస్తున్నారని, హైదరాబాద్‌లో ఫ్రీడం, ప్రజాపాలన ఎంజాయ్ చేస్తోంది ఇద్దరే అని, హైదరాబాద్‌లో ఫ్రీడం, ప్రజాపాలనను దొంగలు, దోమలు ఎంజాయ్ చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో చోరీలు పెరిగాయని, నగరంలో దోమలతో విష జ్వరాలు వస్తున్నాయని పేర్కొన్నారు

# రోహిత్ రెడ్డిపై బీఆర్ఎస్ అధిష్ఠానం చర్యలు



తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:

మాదక ద్రవ్యాల వినియోగం ఆరోపణల నేపథ్యంలో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డిపై భారత రాష్ట్ర సమితి చర్యలకు ఉపక్రమించింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన పార్టీ అధిష్ఠానం ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, పార్టీ క్రమశిక్షణా వ్యవహారాల బాధ్యులు సోమా భరత్ కుమార్ ఈ మేరకు నోటీసు ఇచ్చారు. ఈ అంశం విస్తృతంగా మీడియాలో ప్రచారం పొందడం వల్ల పార్టీ ప్రతిష్ఠకు, ప్రజల్లో ఆందోళనకు దారితీసిందని నోటీసులో పేర్కొన్నారు.

భారత రాష్ట్ర సమితి పార్టీ ఒక బాధ్యతాయుతమైన రాజకీయ సంస్థగా చట్టపరమైన నిబంధనలు, నైతిక విలువలను పాటించడంలో కట్టుబడి ఉందని తెలిపారు. అక్రమ కార్యకలాపాలు, ముఖ్యంగా మాదక ద్రవ్యాల వినియోగం లేదా వాటితో ఏ విధమైన సంబంధం కలిగి ఉండటాన్ని పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. రోహిత్ రెడ్డి ప్రమేయంపై వచ్చిన ఆరోపణలు పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉండటంతో ఈ విషయాన్ని పార్టీ అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. నోటీసు అందిన తేదీ నుంచి ఏడు రోజుల్లోపు స్పష్టమైన, సమగ్ర లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని రోహిత్ రెడ్డిని ఆదేశించారు.

ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే వరకు పార్టీ కార్యక్రమాలు, అధికారిక కార్యకలాపాల్లో రోహిత్ రెడ్డి పాల్గొనకుండా ఉండాలని కూడా ఆదేశాలు ఇచ్చామని భరత్ కుమార్ పేర్కొన్నారు. నోటీసుకు గడువులోగా సంతృప్తికరమైన వివరణ సమర్పించకపోతే పార్టీ రాజ్యాంగం, నియమావళి ప్రకారం ఎటువంటి అదనపు నోటీసు లేకుండానే తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, మొయినాబాద్ ఫామ్హౌస్ డ్రగ్స్ కేసులో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు మూలాలను, అంతర్జాతీయ సంబంధాలపై దర్యాప్తు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేక విచారణ బృందం సిట్‌ను ఏర్పాటు చేయనుంది. సిట్ ఏర్పాటు చేస్తూ మంగళవారం ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేయనుంది. రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో ఈ సిట్ ఏర్పాటు చేయనుంది. ఈ కేసును అన్ని కోణాల్లో విచారణ చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శనివారం ఫామ్ హౌస్‌లో నిర్వహించిన పార్టీలో డ్రగ్స్ వాడినట్లు నిర్ధారణ కావడం, విచారణకు వెళ్లిన పోలీసులపై కాల్పులు జరపడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫాంహౌస్‌లో గతంలోనూ ఇలాంటి అసాంఘీక ఘటనలే జరిగాయన్న సమాచారం ప్రభుత్వానికి చేరడంతో ఈ ఫాంహౌస్ వేదికగా జరుగుతున్న, జరిగిన అంశాలపైనా సిట్ విచారణ చేయనుంది. రోహిత్ రెడ్డి పార్టీకి ఎవరెవరు హాజరయ్యారు? డ్రగ్స్ ఎక్కడి నుంచి సరఫరా చేశారు? డ్రగ్స్‌తో పాటు అసలు ఫాంహౌస్‌లో ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయి? గతంలో ఎవరైనా ప్రముఖులు ఇక్కడికి వచ్చారా? వస్తే వారికి ఎలాంటి పార్టీ ఇచ్చారు? ఇదే తరహాలో ఎన్ని పార్టీలు జరిగాయి? అన్న కోణంలో సిట్ విచారణ చేసే అవకాశం ఉంది. డ్రగ్స్ దందాతో పాటు దుబాయ్‌కు ఉన్న సంబంధాలపై సిట్ ఆరా తీయనుంది. అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియాతో నిందితులకు ఏమైనా పరిచయాలు ఉన్నాయా? అన్న లింకులపైనా సిట్ బృందం ఫోకస్ చేయనుంది. సిట్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయంతో ఈ కేసులో మరికొంత మంది రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందా? అన్న ఉత్కంఠ నెలకొంది.

# డ్రగ్స్ టెస్టుకు సీఎం రెడీ



తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:

మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఈ అంశంపై శాసనమండలిలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. డ్రగ్స్ వ్యవహారంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. టీపీసీసీ చీఫ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ బీఆర్ఎస్ నేతలకు బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా డ్రగ్ టెస్టుకు సిద్ధంగా ఉన్నారని ఆయన ప్రకటించారు. తొలి డ్రగ్స్ టెస్ట్ సీఎం రేవంత్ రెడ్డి చేయించుకుంటారని మహేష్ గౌడ్ అన్నారు. 'తెలంగాణ ప్రజలకు ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలవాలి. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయిపరం చేసిన ఘనులు బీఆర్ఎస్ నేతలు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకోసం స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసింది. డ్రగ్స్‌కు మేం వ్యతిరేకంగా అని చెప్పేందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి డ్రగ్ టెస్ట్ చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా కూడా డ్రగ్స్ పరీక్షలకు వస్తారు. మరి బీఆర్ఎస్ నేతలు డ్రగ్స్ టెస్టుకు సిద్ధమా?. బీఆర్ఎస్ సభ్యులు తమ నాయకులైన ప్రతిపక్షనేత కేసీఆర్, కేటీఆర్‌లను కూడా డ్రగ్ టెస్టుకు తీసుకురాగలరా' అని మహేష్ కుమార్ గౌడ్ ఛాలెంజ్ చేశారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని, తప్పు చేయని వారు భయపడాల్సిన అవసరం లేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసును అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్న బీఆర్ఎస్ ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. నేరస్తులు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లతో శాసనమండలి దద్దరిల్లింది. రాజకీయ నేతల మధ్య మొదలైన ఈ 'డ్రగ్ టెస్ట్' వార్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంతకీ డ్రగ్స్ టెస్టుకు ఎవరు వస్తారో, ఎవరు డుమ్మా కొడతారని తెలంగాణ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ అధిష్టానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని, ఈ కేసుకు సంబంధించి వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. నివేదిక సంతృప్తికరంగా లేని పక్షంలో క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, తుది నిర్ణయం వచ్చే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేసింది. రాజకీయ వర్గాల్లో ఈ నిర్ణయం సంచలనం సృష్టిస్తోంది.

# ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- యువతకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఈ ప్రభుత్వాన్ని ఇక సహించం
- బిజెపి పోరుబాటే
- తొర్రూరు అర్బన్ బీజేపీ మండల అధ్యక్షులు పైండ్ల రాజేష్



**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని,కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సహించేది లేదు అని తొర్రూరు అర్బన్ బీజేపీ మండల అధ్యక్షులు పైండ్ల రాజేష్ అన్నారు.స్థానిక పట్టణ కేంద్రం లో తొర్రూరు అర్బన్ బీజేపీ మండల అధ్యక్షుడు పైండ్ల రాజేష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత రెండున్నర సంవత్సరాలుగా యువతకు నిరుద్యోగ భృతి కల్పిస్తామని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అర్హులైన యువతకు నిరుద్యోగ భృతి కల్పిస్తూ,ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించాలని, వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేసి ఖాళీగా ఉన్నా ఉద్యోగాలను భర్తీ చెయ్యాలని,అలాగే వృద్దులకు, వితంతువులకు, వికలాంగులకు కొత్త పెన్సషన్లు వెంటనే చెల్లించాలని, స్థానికంగా నిర్లక్ష్యానికి గురైన 100 పడకల హాస్పిటల్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మొన్నటి వరకు మున్సిపాలిటీ ఎన్నికలలో హామీల వర్షం కురిపించి గద్దెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తాను స్థానికంగా చేస్తానని ఇచ్చిన హామీలను స్థానిక మున్సిపాలిటీలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన గోపాలగిరి రోడ్డుకు ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన నిరుపేదలకు అందించాలని స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ని కూడా డిమాండ్ చేయడం జరుగుతుంది అని అన్నారు. పెండింగ్ లో సమస్యను వెంటనే పరిష్కరించాలని. స్థానిక తహసీల్దార్ కి వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ కార్యదర్శి మాజీ కౌన్సిలర్ కొలుపుల శంకర్, తొర్రూరు రూరల్ అధ్యక్షుడు గట్టు రాంబాబు,రాష్ట్ర కౌన్సిలింగ్ నెంబర్ రచ్చ కుమార్,జిల్లా నాయకులు అలిసేరి రవిబాబు,మంగళపల్లి యాకన్న,చలువాది సత్యనారాయణ,తొర్రూర్ అర్బన్ ప్రధాన కార్యదర్శిలు పప్పుశెట్టి సంతోష్ కుమార్, నడిగడ్డ సందీప్,తూర్పాటి సాయి ముఖేష్, జలగం రవి, గుండా సురేష్,మూల శేఖర్, నర్కుటి చలపతి రాజ్,గట్ల భరత్, ధరావత్ తేజస్ నాయక్, బీజేవైఎం నాయకులు కాగు నవీన్, నూకల నవీన్, తూర్పాటి మోహిత్, అనిల్, సాకేత్ రవి నాయక్, తాటిశెట్టి నవీన్,నరేందర్, నరేష్,వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# మానవత్వం చాటిన జాజాపూర్ ఉపాధ్యాయ బృందం

- అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విద్యార్థినికి ఆర్థిక సహాయం

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట జిల్లాలో జాజాపూర్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అనురాధ అనే అమ్మాయి గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతుంది.వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని పాఠశాల ఉపాధ్యాయ బృందం అప్పంపల్లిలో ఉన్న ఆ విద్యార్థిని ఇంటికి వెళ్లి,మనోధైర్యం చెప్పి,చికిత్స నిమిత్తమై 18 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి,పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రతాప్, భానుప్రకాష్,లక్ష్మణ్,నరసింహ,రఘురాంరెడ్డి,మంగళ,శశిరేఖ,నిర్మల,శ్రీదేవి,శిరీష,సాయికృష్ణ,మాణిక్యప్ప,వెంకటేష్,నితిన్ పాల్గొన్నారు.



# జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేద్దాం

- పేట జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్ జైన్

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో పిఆర్టియు టిఎస్ జిల్లా బృందం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను,నోటు పుస్తకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, పిఆర్టియు నాయకులతో మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో పాఠశాలలు చాలా చక్కగా పనిచేస్తున్నాయని రికార్డు ఉంది.దానిని అలాగే కొనసాగిస్తూ జిల్లాలో విద్యాభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దామని అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే అందరూ ఎప్పుడైనా కలవచ్చుని,ముఖ్యంగా వేసవి ప్రారంభమైనందున పాఠశాలలో పరిశుభ్రమైన తాగునీరు,పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనము మరియు మూత్రశాల నిర్వహణ ఉండే విధంగా చూడాలని అన్నారు.జిల్లా అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ లో పనిచేయుచున్న ఉపాధ్యాయుల అకాల మరణం వలన వారి కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నాయని వారికి ఆధారపడి ఉన్న వారిని కారుణ్య నియమాకాలలో నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట మండల అధ్యక్షులు ఎం.రఘువీర్,దామరగిద్ద మండల అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ రెడ్డి,రమేష్,జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాష్,టిఆర్టి సీనియర్ నాయకులు శ్రీనివాస్,మహేష్,శేఖర్ రెడ్డి,వెంకటేష్,బాలాజీ,రవికుమార్,వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీరామనవమి వేడుకల ఏర్పాట్లపై సమీక్ష

- భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్‌పల్లి,తెలంగాణ చౌరస్తా:**

రాబోయే శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని కూకట్‌పల్లి రామాలయంలో నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకలు భక్తులకు సౌకర్యవంతంగా జరిగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కూకట్‌పల్లి రామాలయ ప్రాంగణంలో శ్రీరామనవమి ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకొని ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రత్యేకంగా జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్, ట్రాఫిక్, శాంతిభద్రతల శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు తగినంత మంచినీటి సౌకర్యం, శుభ్రత, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. అదేవిధంగా భక్తుల రాకపోకలు సాఫీగా ఉండేలా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని శాంతిభద్రతల విషయంలో ఎటువంటి లోపం లేకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. భక్తులు అధికారులకు సహకరిస్తూ వారు సూచించిన మార్గాలను అనుసరించాలని ఎమ్మెల్యే కోరారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు సౌకర్యంగా ఉండేలా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని అన్నదాన కార్యక్రమం వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన సంఖ్యలో స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్, ట్రాఫిక్, శాంతిభద్రతల విభాగాల అధికారుల తో పాటు మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజా దేవి రంగారావు, మాజీ చైర్మన్ తులసిరావు, సూర్యారావు, ఆనందరావు, అశోక్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# భగత్ సింగ్ యువజనోత్సవాలకు పోస్టర్ ఆవిష్కరణ

**చేవెళ్ల తెలంగాణ చౌరస్తా:**

చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మండల కేంద్రం లో విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ 95వ వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న "భగత్ సింగ్ స్మారక యువజనోత్సవాలు" విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడిన నాయకులు, దేశ స్వాతంత్ర్య సమరంలో యువతకు మార్గదర్శకులైన భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. సామాజిక న్యాయం, లౌకికత్వం, సమానత్వం కోసం వారు చేసిన త్యాగాలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం విద్యా రంగంపై దాడులు ప్రజాస్వామ్య హక్కుల హననం వంటి పరిస్థితుల్లో భగత్ సింగ్ ఆలోచనలు మరింత అవసరమని తెలిపారు.సమాజ మార్పు కోసం యువత చైతన్యవంతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్ యాప్స్ వంటి వ్యసనాల నుండి యువత దూరంగా ఉండాలని, వాటి వ్యతిరేకంగా విద్యార్థులు, యువజనులు పోరాడాలని సూచించారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఈ యువజనోత్సవాల్లో భాగంగా సెమినార్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చా వేదికలు, యువజన ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శులు విద్యార్థి నాయకులు యువత పాల్గొన్నారు.



# ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగస్వాములు కావాలి

- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం వేగవంతం
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య.

**చేవెళ్ల,తెలంగాణ చౌరస్తా:**

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మున్సిపల్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 15,16వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ బండారు శైలజా ఆగిరెడ్డిలతో కలిసి ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వార్డుల్లో నెలకొన్న వివిధ సమస్యలను తెలుసుకుని వాటిని ప్రణాళికబద్ధంగా గుర్తించి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈనెల 6న ప్రారంభమై జూన్ 2న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ముగుస్తుందని అన్నారు. వార్డుల్లో నెలకొన్న వివిధ సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఉపయుక్తంగా ఉంటుందన్నారు.పార్టీలకతీతంగా ముందుకు వచ్చి మన గ్రామాన్ని మనమే అభివృద్ధి చేసుకుంటూ ప్రభుత్వ నిధులు మంజూరు చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్ కౌన్సిలర్స్ మద్దెల శ్రీనివాస్ ముదవత్ కృష్ణ నాయక్ నర్సింలు, గోపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, సొసైటీ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీపీ మంగలి బాలరాజ్ మాజీ సర్పంచులు ప్రభాకర్ బీమయ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# విజయలక్ష్మి హాస్పిటల్‌పై డిఎంహెచ్వో ఆకస్మిక తనిఖీ

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

తొర్రూరు పట్టణంలో స్థానిక విజయ లక్ష్మి హాస్పిటల్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ఈ ఆసుపత్రికి సంబంధించిన వైద్యుడిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ నిమిత్తం ఈ తనిఖీ నిర్వహించారు,డిఎంహెచ్వో తనిఖీ సమయంలో ఆసుపత్రి మూసివేసి ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో, అక్కడ ఉన్న సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆసుపత్రుల నిర్వహణలో నిర్లక్ష్యం,నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి ఆసుపత్రి యాజమాన్యం,సిబ్బందిపై ఉందని ఆయన తెలిపారు.ఈ సంఘటనపై పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేసి, తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# ఇంద్రానగర్ బస్తీలో పాదయాత్ర

- పెండింగ్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్

**కూకట్‌పల్లి,తెలంగాణ చౌరస్తా:**

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ అన్నారు.మంగళవారం స్థానిక నాయకులతో కలిసి కూకట్‌పల్లి పరిధిలోని ఇంద్రానగర్ బస్తీలో పాదయాత్ర నిర్వహించరు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి కూకట్‌పల్లి పర్యటన సందర్భంగా స్థానికులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు పేర్కొన్నారు. పాదయాత్ర సందర్భంగా బస్తీ ప్రజలు తమ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీటి సరఫరా, రహదారుల దుస్థితి వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని విన్నవించారు. అదనంగా కొత్తగా విద్యుత్ మీటర్లు ఇవ్వడం లేదని కూడా ఆయన దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీ పైపులైన్ పనులకు గతంలోనే అనుమతులు లభించినప్పటికీ పనులు మధ్యలోనే నిలిచిపోయాయని స్థానికులు వివరించారు. ఈ విషయంపై స్పందించిన బండి రమేష్ ఇప్పటికే అనుమతులు లభించిన పనులను ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ బస్తీతో పాటు ఐడిపిఎల్‌కు చెందిన ప్రభుత్వ భూములను కొంతమంది వ్యక్తులు అక్రమంగా కబ్జాచేసి విక్రయిస్తున్నారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన బండి రమేష్ ఐడిపిఎల్ భూముల కబ్జాలపై ప్రభుత్వం ఇప్పటికే విచారణ చేపట్టిందని తెలిపారు. విచారణ పూర్తై నివేదిక అందిన వెంటనే, ఎంతటి వారినైనా పార్టీలకు అతీతంగా కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అక్రమంగా ఆక్రమించిన భూములను తిరిగి ప్రభుత్వ స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధు గౌడ్, సోను, పులి శివ గౌడ్, మధు, నరేందర్, తిరుపతయ్య, సత్యం, శంకర్ గౌడ్, ఏ రాజు, బి రాజు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి – షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

- లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేసిన ఏఎంసీ ఛైర్మన్



**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట నియోజకవర్గ ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి,మాజీ డిసిసి అధ్యకులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నారాయణపేట,ధన్వాడ మరికల్ మండలాల కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏఎంసి ఛైర్మన్ రాంపురం శివారెడ్డి,ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు చిట్టెం మాధవ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ పథకాల ద్వారా పెద్ద ఎత్తున సహాయం అందజేస్తోందని తెలిపారు. వివాహ ఖర్చులను తగ్గించేందుకు కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరంగా మారాయని చెప్పారు.నారాయణపేట మండల పరిధిలోని 149 లబ్ధిదారులకు జాజాపూర్ రైతువేదికలో మరికల్ మండల పరిధిలోని 40 లబ్ధిదారులకు,ధన్వాడ మండల పరిధిలోని 38 లబ్ధిదారులకు, మరికల్ కేంద్రంలోని సూర్యచంద్ర ఫంక్షన్ హాల్ లో చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షులు కాంతు కుమార్ ముదిరాజ్,కౌన్సిలర్ గొల్ల రవి,మార్కెట్ డైరెక్టర్లు రాజారెడ్డి,లక్ష్మయ్య గౌడ్,రాగ్య నాయక్,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్యమోహన్ రెడ్డి, కోట్ల రవీందర్ రెడ్డి,జనార్ధన్ గౌడ్,జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు గౌస్,ధన్వాడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరహరి,మరికల్ మండల అధ్యక్షులు వీరన్న,మరికల్ పట్టణ అధ్యక్షులు హరికృష్ణ,సంబంధిత ఎమ్మార్వోలు,వివిధ గ్రామ సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొన్నారు.

# ఆకెనపల్లిలో వైభవంగా 'ఇందిరమ్మ ఇళ్ల' భూమిపూజ

- పేదల సొంతింటి కల సాకారం దిశగా అడుగులు
- సర్పంచ్ గాదె స్రవంతి-సుధాకర్



**రామగుండం,తెలంగాణ చౌరస్తా:**

రామగుండం శాసనసభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, ఆకెనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం గ్రామంలో ఎంపికైన లబ్ధిదారులు మెండే మల్లేశ్వరి-లక్ష్మణ్, గుర్రాల రమ్య-సది, ఉప్పులేటి స్వరూప-పర్వతాలులకు సంబంధించిన గృహ నిర్మాణ పనులకు మండల అధికారులతో కలిసి సర్పంచ్ గాదె స్రవంతి సుధాకర్ భూమి పూజ నిర్వహించి, ముగ్గు పోశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపిడిఓ తిరుపతి, ఎంపీఓ వేణు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గాదె స్రవంతిసుధాకర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మార్గదర్శకత్వంలో నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని, గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏ ఈ సంజయ్,గ్రామ పంచాయతీ కార్యదర్శి కె. రమేష్,వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గ్రామస్తులు ఈ సందర్భంగా తమకు ఇళ్ల నిర్మాణం చేపట్టినందుకు ఎమ్మెల్యే కి, స్థానిక ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కోటి రూపాయల దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

- నిందితులను అరెస్టు
- వారి వద్ద నుంచి 77 లక్షల 39వేల నగదు స్వాధీనం
- కూకట్‌పల్లి జోన్ డీసీపీ రీతీరాజ్





**కూకట్ పల్లి తెలంగాణ చౌరస్తా:**

కూకట్‌పల్లి పరిధిలో సంచలనం సృష్టించిన రూ. కోటి దోపిడీ కేసును పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించి నిందితులను పట్టుకోవడం లో చేకచక్యంగా వ్యవహరించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను కూకట్‌పల్లి జోన్ డీసీపీ రీతీరాజ్ మీడియాకు వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం... బహదూర్‌పురాకు చెందిన ఖుస్రోద్దీన్ తన యజమాని పంపించిన హవాలా నగదుపై కన్నేసి ఆ డబ్బును అపహరించేందుకు ముందుగానే పన్నాగం పన్నాడు. ఈ కుట్రలో భాగంగా తన స్నేహితుడు ఒమర్ షరీఫ్‌తో పాటు మరికొంత మందితో కలిసి దోపిడీకి స్కెచ్ వేసినట్లు పోలీసులు వెల్లడించారు.సోమవారం రాత్రి కూకట్‌పల్లిలో కోటి రూపాయల నగదుతో ప్రయాణిస్తున్న సమయంలో నిందితులు ముందస్తు ప్రణాళిక ప్రకారం వాహనాన్ని వెంబడించారు. పిల్లర్ నంబర్ 836 వద్దకు చేరుకున్నప్పుడు ఖుస్రోద్దీన్, అజీముద్దీన్‌ల కళ్లలో మిరపపొడి చల్లి నగదుతో పరారయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ద్వారా విషయం సీఐ సుబ్బారావుకు చేరింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు అక్కడే వదిలేసిన హోండా యాక్టివా వాహనం ఆధారంగా పరిసర ప్రాంతాల సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ పోలీసులు వేగంగా విచారణ కొనసాగించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులు శంషాబాద్ విమానాశ్రయం వైపు పారిపోతున్నట్లు పోలీసులు గుర్తించారు. లక్నోకు పారిపోయే యత్నంలో ఉన్న సమయంలోనే వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో ఒమర్ షరీఫ్(32), గౌస్ సద్దాం(28), హమీద్(33), ఖుస్రోద్దీన్ (42)ఉన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.77.39 లక్షల నగదు, 39,195 ఫ్లైట్ టికెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో బాధితుడిగా నటించిన ఖుస్రోద్దీన్ నే అసలు ప్రధాన సూత్రధారిగా పోలీసులు గుర్తించడం కేసుకు కీలక మలుపుగా మారింది. నగదు పై ఆశతోనే ఈమొత్తం కుట్రను పన్నినట్లు పోలీసులు వెల్లడించారు. ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్టు చేసికోర్టు రిమాండ్‌కు తరలించగా పరారీలో ఉన్న మరో ఐదుగురు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కేవలం 24 గంటల్లోనే కేసును ఛేదించిన కూకట్‌పల్లి పోలీసులు, సీసీఎస్ బృందం పనితీరును డీసీపీ రీతీరాజ్ ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యవంతమైన సమాజం

- కన్నాలలో రైతులకు అవగాహన సదస్సు
- కిట్లు పంపిణీ చేసిన శాస్త్రవేత్తలు



**పాలకుర్తి,తెలంగాణ చౌరస్తా:**

రసాయన రహిత సాగుతోనే నేల తల్లి ఆరోగ్యం, మానవ మనుగడ సాధ్యమని, వ్యవసాయ శాస్త్రవేత్తలు స్థానిక ప్రజాప్రతినిధులు ఉద్ఘాటించారు. మంగళవారం కన్నాల గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ , కేవీకే, రామగిరి ఖిల్లా ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి ఖర్చు దాదాపు సున్నా అని వివరించారు. దేశీయ ఆవు ఆధారిత ఉత్పత్తులతో సాగు చేయడం వల్ల నేల సారవంతం అవుతుందనీ తెలిపారు.పురుగుమందుల వాడకం లేకపోవడం వల్ల సమాజానికి ఆరోగ్యకరమైన పంట లభిస్తుందనీ అన్నారు.ఒకే పొలంలో రకరకాల పంటలు వేయడం ద్వారా రైతుకు అదనపు ఆదాయం రావడమే కాకుండా పర్యావరణం సమతుల్యంగా ఉంటుందనీ అన్నారు.

**ప్రజాప్రతినిధుల సూచనలు**

కన్నాల సర్పంచ్ మాల్క రామస్వామి మాట్లాడుతూ ...కోతుల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగుపై మొగ్గు చూపాలని కోరారు. బాప్లు నాయక్ తండా సర్పంచ్ ఇస్లావత్ అఖిల మాట్లాడుతూ...నేల ఆరోగ్యంగా ఉంటేనే మనం తినే ఆహారం ఆరోగ్యంగా ఉంటుందని, భూసారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జీడి నగర్ సర్పంచ్ సూరం రమా మాట్లాడుతూ...శాస్త్రవేత్తలు అందించే సూచనలను రైతులు అందిపుచ్చుకుని ఆధునిక, ప్రకృతి పద్ధతుల్లో సాగు చేయాలని పిలుపునిచ్చారు.

**రైతులకు ప్రోత్సాహక కిట్ల పంపిణీ**

సదస్సులో భాగంగా గతంలో పేరు నమోదు చేసుకున్న రైతులకు వ్యవసాయ శాఖ తరపున ప్రత్యేక కిట్లను అందజేశారు. ఇందులో కాన్వాస్ బ్యాగ్, క్యాప్, ఫామ్ డైరీ (హ్యాండ్ బుక్) ద్రావణాలు, కషాయాల తయారీ విధానంపై అవగాహన కల్పించే బుక్‌లెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, ఏఈఓ బి. శశిధర్, కేవీకే శాస్త్రవేత్తలు డా. పి. కిరణ్, డా. బి. భాస్కర్, ఆయిల్ పామ్ ఫీల్డ్ అసిస్టెంట్ టి. ప్రశాంత్, కన్నాల రెవెన్యూ పరిధిలోని అధిక సంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పటాన్ చేరు మార్కెట్ కమిటీ నూతన పాలక మండలికి ఘన సన్మానం

- రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి
- మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలరాజ్



**పటాన్ చేరు,తెలంగాణ చౌరస్తా:**

పటాన్ చేరు నియోజకవర్గ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలికి మర్యాదపూర్వక సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శివానందం, వైస్ చైర్మన్ రాజశేఖర్ డైరెక్టర్ లు హమీద్,సందీప్ లను మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలరాజు మరియు చిన్న ముదిరాజ్, మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ బాలరాజు మాట్లాడుతూ.. నూతన పాలక మండలి ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా రైతులకు మార్కెట్ యార్డులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.మార్కెట్ కార్యకలాపాల్లో పారదర్శకతను పాటిస్తూ, రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా కృషి చేయాలన్నారు.నియోజకవర్గంలోని రైతుల అవసరాలకు అనుగుణంగా మార్కెట్ కమిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నిరుపేదలకు ఆపన్నహస్తం ముఖ్యమంత్రి సహాయనిది

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- 2 లక్షల 90 వేల రూపాయల విలువైన ఎల్ఓసిల పంపిణీ

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

ఆపత్కాల సమయంలో నిరుపేదలకు ఆపన్నహస్తం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని నర్రగూడ, బీరంగూడ డివిజన్ పరిధిలోని భ్రమరాంబికనగర్ కాలనీలకు చెందిన ఆలకుంట సాయి కుమార్, బూస ప్రసన్నలు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుండి మంజూరైన రెండు లక్షల 90 వేల రూపాయల విలువైన ఎల్ఓసి పత్రాలను మంగళవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మల్లేష్ యాదవ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ ఉత్సవాలకు సర్పంచ్ 12,016 విరాళం

**రామగిరి,తెలంగాణ చౌరస్తా:**




రామగిరి మండలం రత్నపూర్ గ్రామం లో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు జరిగాయి.ఈ సందర్భంగా డప్పులు, జమిడికల వాయిద్యాలతో గౌడ కులస్తుల మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకుని ర్యాలీగా వెళ్లారు. స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు రూపాయలు 12,016 విరాళంగా అందించారు. గ్రామాన్ని దేవత చల్లగా చూడాలనీ కోరుకున్నారు. ఈ కార్యక్రమం లో గౌడ సంఘం అధ్యక్షుడు నగునూరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కెక్కర్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు పబ్బ స్రవంతి వెంకటేష్, కెక్కర్ల ఉష అశోక్,పబ్బ మొగిలి, కెక్కర్ల చిన్న సమ్మయ్య, నగునూరి శ్రీనివాస్, ముక్కెర కుమార్, పబ్బా వెంకటేష్, ముక్కెర ఓదెలు, కేక్కర్ల రాములు,శంకరయ్య, ముక్కెర చిన్న, కెక్కర్ల రాకేష్, కెక్కర్ల నగేష్, కెక్కర్ల శ్రీనివాసు, కెక్కర్ల సమ్మయ్య, ముక్కెర సారథి, దాసరి రామచంద్రం పాల్గొన్నారు.


# గ్రామ విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

- ఏఈ శంకర్ కు సర్పంచ్ వినతిపత్రం



**అంతర్గాం,తెలంగాణ చౌరస్తా:**

మండలంలోని అకెనపల్లి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించి, గ్రామ ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ స్రవంతి సుధాకర్ మంగళవారం అంతర్గాం విద్యుత్ శాఖ ఏఈ శంకర్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు గ్రామ పరిధిలోని ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో పాతబడి, ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, వేలాడుతున్న పాత విద్యుత్ తీగలను మార్చి కొత్త లైన్లను ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరా సరిగ్గా లేని వాడలకు కొత్తగా లైన్లు వేసి నిరంతర విద్యుత్ అందించాలని విన్నవించారు. వినతి పత్రం స్వీకరించిన ఏఈ శంకర్ సానుకూలంగా స్పందిస్తూ.. గ్రామంలో విద్యుత్ సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, త్వరితగతిన కొత్త పోల్స్ మరియు లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యుత్ వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.




# గీతంకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు అవార్డు

- స్థిరమైన మద్దతు, నిస్వార్థ నిబద్ధతకు గుర్తింపుగా అందజేసిన మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు చేపట్టిన కార్యక్రమాలకు హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అందిస్తున్న ఉదారమైన విరాళాలు, స్థిరమైన మద్దతుకు గుర్తింపుగా మంగళవారం ఒక జ్ఞాపికను, అవార్డును అందజేశారు. ఈ ప్రశంసా పత్రంలో గీతం యొక్క నిస్వార్థ నిబద్ధతను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, నిరుపేదల జీవితాలలో సానుకూల మార్పు తీసుకురావడంలో దాని ప్రయత్నాలు కీలక పాత్ర పోషించాయని, విస్తృత సమాజానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పురస్కారాన్ని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి చేతుల మీదుగా గీతం హైదరాబాదు రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మకు అందజేశారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో గత నాలుగేళ్లగా గీతంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను చురుకుగా నిర్వహిస్తున్నారు. రక్తదానం యొక్క ప్రాణరక్షక ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, విద్యార్థులలో కరుణ, సామాజిక బాధ్యత, సేవా స్ఫూర్తిని పెంపొందిస్తున్నారు. ప్రాణాలను కాపాడటంలో సహాయపడి, ఇతరులను కూడా ఇటువంటి గొప్ప కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహించే విద్యార్థుల ఉదారతను, నిస్వార్థ సహకారాన్ని నిర్వాహకులు ప్రశంసించడంతో ఈ కార్యక్రమానికి విస్తృత ప్రశంసలు లభించాయి. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, ఆతిథ్య విభాగంక్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, గీతం డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు తదితరులు ఈ అవార్డును అందుకోవడంపై హర్షాతిరేకాలు వ్యక్తపరిచారు. ఇటువంటి ప్రభావవంతమైన సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించడానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు.

# ఒలంపియాడ్‌లో సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు

**హనుమకొండ, తెలంగాణ చౌరస్తా:**

హనుమకొండ లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు గత నెలల నిర్వహించిన ఐఎన్టిఎస్ఓ ఒలంపియాడ్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి లెనోవా టాబ్,బంగారు పథకాలు ప్రశంస పత్రాలు ఇతర బహుమతులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ నళిని శ్రీ తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ.... జాతీయ అంతర్జాతీయ పోటీ పరీక్షలకు తమ విద్యార్థులను సన్నద్ధం చేస్తూ ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ యొక్క ప్రతిభతో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్,అకాడమిక్ డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్,ఆర్ఐ మనోహర్, కోఆర్డినేటర్ శివ కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ నళిని శ్రీ,ఇంచార్జ్ ప్రవీణ్, విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అంతర్గాం నూకాంబిక జాతరకు రండి

- సర్పంచ్ ఆంగోత్ రవి నాయక్ సాదర ఆహ్వానం



**రామగుండం,తెలంగాణ చౌరస్తా:**

అంతర్గాం గ్రామంలో కొలువై ఉన్న శక్తి స్వరూపిణి శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నేడు బుధవారం జరగనుందని గ్రామ సర్పంచ్ ఆంగోత్ రవి నాయక్ తెలిపారు. ఈ జాతర సందర్భంగా అమ్మవారి కృపాకటాక్షాల కోసం చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. "అమ్మవారి ఆశీస్సులతో మన గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఏటా నిర్వహించే ఈ జాతరను ఈసారి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామనీ, అంతర్గాం గ్రామ ప్రజలతో పాటు, పొరుగు గ్రామాల ప్రజలు తమ కుటుంబ సభ్యులతో విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాలని విన్నవించారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూ లైన్లు, తాగునీటి సౌకర్యం కల్పించడమైనదనీ, అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు, అగ్ని గుండం కార్యక్రమాలు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. జాతరకు వచ్చే భక్తుల భద్రత దృష్ట్యా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.గ్రామ ప్రజలు, భక్తులు ఈ శుభకార్యంలో భాగస్వాములై అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి, పునీతులు కావాలని సర్పంచ్ ఆంగోత్ రవి నాయక్ విజ్ఞప్తి చేశారు.

# నవోదయ సీటు సాధించిన వశిష్ఠ స్కూల్ విద్యార్థి

**ఓదెల, తెలంగాణ చౌరస్తా:**




జాతీయ స్థాయి జవహర్ నవోదయ విద్యాలయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలలో ఓదెల మండలం పొత్కపల్లి లోని వశిష్ఠ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి వీరముట్టి తేజ్ s/o సతీష్ నవోదయ సీటు సాధించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మ్యాడగొని కిషన్ గౌడ్ అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వేల మంది పోటీ పడిన పరీక్షలో తమ విద్యార్థి విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు.ప్రతి విద్యార్థి కష్టపడి ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.



# ఎన్‌టిఆర్ నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారం

**తెలంగాణ చౌరస్తా,కూకట్ పల్లి:**

అల్విన్ కాలనీ డివిజన్ ఎన్‌టిఆర్ నగర్ కాలనీలో పలు వీధుల్లో డ్రైనేజీ సమస్య ఏర్పడడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను కాలనీ ప్రజలు అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదేశాల మేరకు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ కాలనీలో పర్యటించి సమస్యను తెలుసుకొని ఎయిర్ టేక్ యంత్ర సహాయంతో వాటర్ సిబ్బంది డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించారు.శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ, డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆదేశాల మేరకు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం జీహెచ్ఎంసీ వాటర్ వర్క్స్ సిబ్బందితో కలిసి ఎయిర్‌టెక్ యంత్ర సహాయంతో సమస్యను వెంటనే పరిష్కరించారు. డ్రైనేజీ సమస్య తక్షణమే పరిష్కరించడంతో కాలనీ ప్రజలు ఉపశమనం పొందారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, ఖాజా, సూపర్వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.





# బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

- ప్రజాప్రతినిధుల ఇళ్లపై దాడులు దురదృష్టకరం
- దళిత సమాజానికి బండి క్షమాపణలు చెప్పాలి
- దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు
- మండల పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి



**నూతనకల్ తెలంగాణ చౌరస్తా**

తెలంగాణ ఉద్యమకారుడు, దళిత ఎమ్మెల్యే మందుల సామెల్ ఇంటిపై బీజేపీ గుండాలు దాడి చేసిన ఘటనను ఖండిస్తూ నూతనకల్ మండల కేంద్రంలో తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు ఆధ్వర్యంలో ఆందోళన చేసి కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసి తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్లుగా వారు తెలియజేశారు.తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధుల ఇళ్లపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. దళిత ఎమ్మెల్యే మందుల సామెల్ ఇంటిపై దాడి చేయడం ద్వారా బీజేపీ నాయకులు అసహనాన్ని బయటపెట్టారని ఆరోపించారు. ఈ ఘటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ పూర్తి బాధ్యత వహించి దళిత సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అంజయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పశువుల అశోక్ యాదవ్, ఓబీసీ మండల అధ్యక్షుడు కారింగుల రాజు, కృష్ణ, ప్రశాంత్, గణేష్, బద్రి, క్రాంతి, పాల్వాయి ఢిల్లీ, మధు తదితరులు పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి సమన్వయ సమావేశం

- రబీ–2026 సీజన్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి
- ఎమ్మార్వో శ్రీనివాస్

**నూతనకల్ తెలంగాణ చౌరస్తా:**

రబీ-2026 సీజన్‌కు సంబంధించి ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు వ్యవసాయ అధికారులు, ఏపీఎం, ఐకేపీ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించినట్లు ఎమ్మార్వో శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల పరిధిలో ధాన్యపు కొనుగోలు కేంద్రాలను త్వరలో ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రైతు సోదరులందరూ తమ ధాన్యాన్ని తాలు లేకుండా శుభ్రపరచి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని కోరారు.అలాగే కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, కూర్చునే సదుపాయం వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు ఆదేశించారు. రైతులకు పారదర్శకంగా కొనుగోళ్లు జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో సునీత, వ్యవసాయ అధికారి కృష్ణ కాంత్, ఏపీఎం వెంకటరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు, జీపీఓలు,ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



# "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:**

మహమ్మద్ ప్రవక్త బోధనలు చాలా విలువైనవని,మానవ శ్రేయస్సుకై ఉపకరిస్తాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్లోని కరీంనగర్ ఫంక్షన్ ప్యాలెస్ లో పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి ఇఫ్తార్ విందుకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు చేసేటువంటి కఠినమైన ఉపవాస దీక్ష చాలా సత్ఫలితాలు ఇవ్వడమే కాకుండా వారి యొక్క జీవితంలో విజయాలు అందిస్తుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని వాళ్ళు తెలిపారు.నరేందర్ రెడ్డి చేసేటువంటి సేవలు స్ఫూర్తిదాయకమని వారు కొనియాడారు.అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ..... వివిఎన్ఆర్ ఫౌండేషన్ ఆరంభం నాటి నుండి ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని,ప్రవక్త యొక్క ఆశీస్సులు ప్రతి ఒక్కరి మీద ఉండాలని,సమాజ శ్రేయస్సుకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ శాంతికి ప్రతీక అయిన రంజాన్ పండుగను ప్రతి ఒక్కరు ఘనంగా జరుపుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ కుమార్,పలువురు ముస్లిం మత పెద్దలు,మైనార్టీ కార్పోరేటర్లు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే

- రామగుండంలో ఒకరికి 3 రోజుల శిక్ష
- రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు



**రామగుండం, తెలంగాణ చౌరస్తా:**

మద్యం మత్తులో స్టీరింగ్ పడితే జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందేనని రామగుండం ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నలుగురు వ్యక్తులను మంగళవారం గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ముందు హాజరుపరిచారు. నిబంధనలు ఉల్లంఘించిన ముగ్గురు వ్యక్తులకు ఒక్కొక్కరికి ₹6,000 చొప్పున జరిమానా విధించారు.రెండోసారి కూడా అదే తప్పు చేస్తూ పట్టుబడిన ఒక వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.శిక్ష పడిన వ్యక్తిని వెంటనే కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు మాట్లాడుతూ.. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో అస్సలు రాజీ పడబోమని స్పష్టం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనీ,వాహనానికి సంబంధించిన సరైన పత్రాలను ఎల్లప్పుడూ వెంటే ఉంచుకోవాలనీ, నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.



# ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు

- ముస్లిం సోదరులకు తోఫాలు అందజేత
- ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ
- తుంగతుర్తి ఏఎంసి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి



**నూతనకల్ తెలంగాణ చౌరస్తా**

నూతనకల్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మసీద్‌లో దావత్ఎఇఫ్తార్ (ఇఫ్తార్ విందు) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నూతనకల్, మద్దిరాల మండలాలకు చెందిన ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ముస్లిం సోదరుల కోసం ప్రవేశపెట్టిన తోఫాను వారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ముఖ్యంగా ముస్లిం మైనారిటీల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.రంజాన్ పవిత్ర మాసంలో ఇలాంటి కార్యక్రమాలు సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో నూతనకల్, మద్దిరాల మండలాల ఎమ్మార్వోలు శ్రీనివాస రావు, సైదులు, గ్రామ సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్, మసీద్ కమిటీ అధ్యక్షుడు జహంగీర్, కార్యదర్శి షకీల్, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# రికార్డు స్థాయిలో అంగండి వేలం

- రూపాయలు 55.35 లక్షలు



**జమ్మికుంట, తెలంగాణ చౌరస్తా:**

జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మెన్ మొలుగు ప్రశాంత్,కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ అంగడి వేలం పాట 55 లక్షల 35 వేలకు పరకాల గ్రామానికి చెందిన పోరండ్ల రమేష్ దక్కించుకున్నాడు.గతంలో (202526) 40 లక్షల 61వేలకు ఇదే పోరండ్ల రమేష్ దక్కించుకోగా,నేడు నిర్వహించిన వేలం పాటలో పోటాపోటీగా వేలం పాట పాడి పోరండ్ల రమేష్ 55 లక్షల 35 వేలకు దక్కించుకున్నట్లు మున్సిపల్ చైర్మెన్ మొలుగు ప్రశాంత్ కుమార్,కమిషనర్ మహమ్మద్ అయాజ్ లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ జి.రాజిరెడ్డి,ఆర్ఐ భాస్కర్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

- 99 రోజుల ప్రణాళికలో రోడ్డు భద్రతకు ప్రాధాన్యం
- సమన్వయంతో ప్రమాదాల నివారణ
- జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా :**

వివిధ శాఖల అధికారులు సమన్వయంతో రోడ్డు భద్రతా చర్యలు తీసుకుంటూ ప్రమాదాలు నివారించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ.....ప్రమాదాలు జరిగే చోట్లను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నగరంలో, రహదారుల్లో రోడ్లు,డ్రైనేజీలు మరమ్మతులు సమయంలో వాహనదారులు గుర్తించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.కొన్ని పనులు దీర్ఘకాలం పాటు జరిగే అవకాశం ఉన్నందున అక్కడ వాహన ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రమాదాల్లో బాధితులకు తక్షణ వైద్య సాయం అందేలా ఆసుపత్రులకు ఆదేశాలు జారీ చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు.ప్రజాపాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అరైవ్అలైవ్ పేరుతో రోడ్డు భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.అందువల్ల అధికారులు రోడ్డు భద్రతపై దృష్టి పెట్టాలని అన్నారు.ప్రమాదకర మలుపులు,సిగ్నలింగ్ పై దృష్టి సారించాలని,రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ....జిల్లాలో 24 ప్రమాదాలు ఎక్కువగా జరిగే చోట్లు ఉన్నాయని తెలిపారు. హెచ్చరిక బోర్డులు,రోడ్డు వైపు పెరిగిన కొమ్మలు కత్తిరించడం తదితర చర్యల ద్వారా ప్రమాదాలు నివారించాలని సూచించారు.నగరంలో బ్లికింగ్ బల్బులు,జంక్షన్లలో సిగ్నలింగ్, లైటింగ్ వ్యవస్థకు సంబంధించి పలు సూచనలు చేశారు.జగిత్యాల రోడ్డుకు ఇరు ప్రక్కల పొదలు,కొమ్మలను తొలగించడం ద్వారా ప్రమాదాలను నివారించగలమని తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్,ఆర్డీవో మహేశ్వర్,ఆర్టిఏ కమిటీ మెంబర్ పడాల రాహుల్, రోడ్లు భవనాల శాఖ ఈఈ నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట మండలం, కోటకొండ గ్రామంలోని అపెక్స్ స్కూల్లో సెల్ఫ్ గవర్నమెంట్ డే ఘనంగా జరిపారు.విద్యార్థులు చాలా ఉత్సాహంగా ఉపాధ్యాయులుగా వచ్చి, తరగతులలో విషయాలు బోధించారు.కలెక్టర్ గా ప్రణీత,డిఇఓ గా అయాన్,ఎంఈఓ గా కీర్తన,ప్రిన్సిపల్ గా సాయికిరణ్ మరియు పిటి ఉపాధ్యాయులుగా ఉల్లాసభరితంగా స్కూల్లో నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ ప్రతాప్,ఎం.అనిత,మహేశ్వరి,దీపిక తెలిపారు.

# ప్రతిభ కనబరిచిన ప్రియదర్శిని విద్యార్థినులు

- క్రియేటివ్ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ లో ఉద్యోగులు

**ఖమ్మం, తెలంగాణ చౌరస్తా:**

ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రముఖ సంస్థ క్రియేటివ్ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ లో ఉద్యోగాలకు ఎంపికై కళాశాలకు గౌరవాన్ని తీసుకువచ్చారు.ఎంపికైన విద్యార్థినులు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, వెబ్ డెవలపర్ హోదాల్లో సంవత్సరానికి రూ.4 లక్షల వేతనంతో నియామకం పొందారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు విద్యార్థినుల విజయాన్ని అభినందించారు.విద్యార్థినులు మంచి ఉద్యోగాలను సాధించడం వెనుక అధ్యాపకుల నిరంతర శ్రమ,మార్గదర్శనం,కళాశాల నిర్వహణ అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలు ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్ మాట్లాడుతూ...విద్యార్థినులు ఈ స్థాయికి చేరుకోవడానికి కళాశాల అధ్యాపకులు అందించిన మార్గదర్శనం,నిరంతర శిక్షణ, ప్లేస్‌మెంట్ కార్యక్రమాలు ముఖ్య పాత్ర పోషించాయని పేర్కొన్నారు.కళాశాలలో నిర్వహిస్తున్న క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ తరగతులు,సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ శిక్షణ వంటి కార్యక్రమాలు విద్యార్థినులను ఉద్యోగావకాశాలకు సిద్ధం చేస్తున్నాయని,తమ కళాశాల ఎల్లప్పుడూ విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ విజయం సాధించిన విద్యార్థినులు భవిష్యత్తులో తమ ప్రతిభతో సంస్థలో మంచి పేరు తెచ్చుకోవడంతో పాటు కళాశాల ప్రతిష్టను మరింత పెంచాలని, మొత్తం 84 మంది విద్యార్థినులు రిజిస్టర్ అవ్వగా 15 మంది ఎంపిక కావడం వారి కృషి,పట్టుదల ప్రతిభకు నిదర్శనమని అన్నారు.కళాశాల అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ....కష్టపడి చదివితే మరియు లక్ష్యంతో ముందుకు సాగితే మంచి అవకాశాలు తప్పకుండా వస్తాయని మా కళాశాల విద్యార్థినులు మరోసారి నిరూపించారని,భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో ముందుకు సాగుతూ మరిన్ని విజయాలు సాధించాలని,ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ ఎంపికైన విద్యార్థినులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు,ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ తివారి మన్మోహన్,విద్యార్థులు పాల్గొన్నారు.



# శాతవాహనలో పీహెచ్డీ ఫలితాల విడుదల

**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:**

శాతవాహన విశ్వవిద్యాలయంలో పీహెచ్డీ ప్రవేశ ఫలితాలను ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ పరిపాలనా భవనంలో విడుదల చేస్తూ విశ్వవిద్యాలయాన్ని పరిశోధనలో కూడా ముందుకు తీసుకువెళ్తామని,అత్యుత్తమ పరిశోదనలు,పేటెంట్స్ తో విద్యారంగంలో మేలైన విశ్వవిద్యాలయంగా నిలుపుతామని పేర్కొన్నారు.ఫాకల్టీ అఫ్ ఆర్ట్స్ తెలుగు,ఉర్దూ,అర్థశాస్త్రం,సామాజిక శాస్త్రంలో,సైన్స్ లో వృక్షశాస్త్ర,రసాయన శాస్త్ర,భౌతిక శాస్త్రఅంలో ఫాకల్టీ అఫ్ కామర్స్ వాణిజ్య శాస్త్ర విభాగంలో ఫలితాలు ఇచ్చారు.ఈ సమయంలో రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్,ఓఎస్డి డా. హరికాంత్,డా.శరసీజ,డా.తిరుపతి ఉన్నారు.ఇతర వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్సైట్లో చూడవలసిందిగా శాతవాహన విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ సంచాలకులు డా.మహమ్మద్ జాఫర్ తెలిపారు.



# తాసిల్దార్ ముందు బైండోవర్ చేసిన ఎక్సైజ్ ఎస్సై

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో టాస్క్ ఫోర్స్, ఎక్సైజ్,సంబంధిత అధికారులు వేరువేరుగా దాడులు చేసి పలువురుని అదుపులోకి తీసుకొని బైండోవర్ నిమిత్తం తాసిల్దార్ జగదీశ్వర్ రావు ముందు హాజరు పరిచినట్లు సుల్తానాబాద్ ఎక్సైజ్ ఎస్సై చిరంజీవి తెలిపారు.గంగారం గ్రామనికి చెందిన బైరీ మమత బెల్టు షాప్ నిర్వాహకుల పైన పెద్దపల్లి టాస్క్‌ఫోర్స్ జిల్లా అధికారి పావని,మమత పై కేసు నమోదు చేశారు.అలాగే జాఫర్ ఖన్ పేటకు చెందిన రాయిశెట్టి కనకమ్మ, పెద్దంపేటకు చెందిన దుప్ప సారమ్మను,కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన రానివేన రాజనర్సు,తాసిల్దార్ జగదీశ్వర్ రావు ముందు హాజరు పరిచారు.లక్ష రూపాయల పూచికత్తు పై విడుదల చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై చిరంజీవి తెలిపారు.వారి వద్ద నుంచి 1:26 లీటర్ల లిక్కర్ మందును సీజ్ చేసినట్లు తెలిపారు.ఈ దాడుల్లో పాల్గొన్న సంబంధిత అధికారులు జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి పావని, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, సిబ్బంది తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# అమ్మగా మారిన అలియా..

తల్లిగా మారాక, పిల్లల గురించి ఎక్కువగా ఆలోచిస్తున్నది బాలీవుడ్ క్రేజీ హీరోయిన్ అలియాభట్. నటిగా సూపర్‌స్టార్‌డమ్‌ని ఎంజాయ్ చేస్తూ, నిర్మాతగా ఎటర్నల్ సన్‌షైన్ ప్రొడక్షన్స్ అనే సంస్థను స్థాపించి, డార్లింగ్స్, జిగ్రా వంటి విభిన్న కథా చిత్రాలను నిర్మించి విమర్శకుల ప్రశంసలందుకున్నది అలియాభట్. తాజాగా తన 33వ పుట్టినరోజును పురస్కరించుకొని, కేవలం పిల్లల కోసం 'ఎటర్నల్ కిడ్స్' పేరిట మరో కొత్త నిర్మాణ సంస్థను ప్రారంభించింది ఈ అందాలభామ. ఈ సంస్థ గురించి అలియా మాట్లాడుతూ 'ఇది నా ఎటర్నల్ సన్‌షైన్ సంస్థకు బిడ్డలాంటిది. పిల్లల కోసం అద్భుతమైన కథలను అందించడమే ఈ సంస్థ లక్ష్యం. నా చిన్నప్పుడు విన్న కథల్నీ, నన్ను పెంచిన కథల్నీ ఈ సంస్థ ద్వారా సజీవం చేయబోతున్నా. త్వరలోనే ఈ సంస్థపై మూడు సినిమాలు పట్టాలెక్కనున్నాయి' అంటూ చెప్పుకొచ్చింది అలియాభట్.

Published and Managing Director by Gaddam Shyam on behalf Mithra Publications, Published at 1-9-1113/1/B, Street No. 11, Vidyanagar, Hyderabad, Telangana-500044.
Editor: GADDAM SHYAM, RNINO. TELTEL12241, tcnewsweb@gmail.com